రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ద్రాక్షారమలో రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామలో గల ఆర్‌సిఎం చర్చి నందు ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 34 మంది రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ నుంచి వచ్చిన డాక్టర్ దుర్గరాజు మాట్లాడుతూ ప్రతి నెల తల సేమియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఈ రక్తాన్ని అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ రెవరెండ్ జోసెఫ్ ప్రభాకర్, డాక్టర్ పివివి. సత్యనారాయణ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీకి పిలుపు

- సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ప్రచారం
- కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా... ఏప్రిల్ 5న చలో ఢిల్లీ చేపడుతున్నామని, లక్షలాదిమందితో జరుగుతున్న కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గా ప్రసాద్, వ్యవసాయాకార్మిక సంఘరాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ముమ్మిడివరంలో ఏప్రిల్ 5 చలో ఢిల్లీ కరపత్రాలు పంపిణీ కార్యక్రమం చేస్తూ మాస్ ఫండ్ క్యాంపెయిన్ నిర్వహించారు.

వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుపెడు తున్నారని అన్నారు దేశ ప్రజలపై ఎక్కువ పన్నులు మోపడంతో మధ్యతరగతి, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తున్నారని, లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తున్నారని అన్నారు. వ్యవసాయాన్ని రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు రక్షణగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. కౌలు రైతులకు రక్షణ లేదన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందన్నారు. కేంద్రం విధానాలతో రాజ్యాంగం పెను ప్రమాదంలో పడిందని, దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక, ఐక్యతతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ముమ్మిడివరం బళ్ళ గేటు నుంచి కాశివాని తూము వరకు ప్రతి షాపునకు వెళ్లి విరాళాలు సేకరించారు. విరాళాలు రూ.8960 వచ్చాయని అన్నారు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, డి.వీర రాఘవులు, సిఐటియు మండల అధ్యక్షులు నిమ్మకాయల వెంకటేష్, విప్పర్తి మోహన్ రావు, విత్తనాల రాంబాబు, జగడం నాగేశ్వరరావు, మూడే చిన్న సత్యనారాయణ, ఇసుకపట్ల మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో పోస్టర్ల ఆవిష్కరణ

మలికిపురంలో ఫండ్ క్యాంపైన్‌లో సిపిఎం నాయకులు

బిజెపి కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి:సిపిఎం

రాజోలు బిజెపి కార్మిక కర్శక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పీతల రామచంద్ర రావు అన్నారు. ఆదివారం మలికిపురం లో ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరిగే పోరాట ప్రదర్శనలు జయప్రదం చేయాలని మాస్ క్యాంపైన్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతుల, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులను యజమానులకు బానిసలు చేసే విధంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలు మార్పులు చేసి, కార్మికుల నియామకాలు తొలగింపులో యజమానిస్వారాజ్యం చేసిందన్నారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన రైతు వ్యతిరేక విధానాలతో వారిని ఆత్మహత్యలకు పురి గొల్పిందన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీ ప్రదర్శనకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజోలు శాఖ కార్యదర్శి బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామమూర్తి, కారుపల్లి గోపాల్ పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవాలి

పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యాయునిపై ఉందని పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జి అన్నారు. అమలాపురం యుటిఎఫ్ హోం నందు ఆదివారం యుటిఎఫ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణ రాజు వర్ధంతి సభలో ముఖ్యఅతిథిగా పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జి పాల్గొని ప్రసంగించారు. యుటిఎఫ్ రాష్ట్రస్థాయిలో ఒక బలమైన శాఖగా ఏర్పడడానికి అప్పారి వెంకటస్వామి వత్సవాయి సూర్యనారాయణరాజు ముఖ్య భూమిక పోషించారని అన్నారు.కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు చిట్టిబాబు, వీరస్వామి, ఎస్.జ్యోతి బసు, ఎంటివి.సుబ్బారావు, సురేంద్ర, పిఎస్. శిరోమణి, సురేష్ కుమార్ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జి

అప్పారి, వత్సవాయి చిత్రపటాల వద్ద యుటిఎఫ్ నాయకుల నివాళి

అమరవీరులకు యుటిఎఫ్ నివాళి

ఐ.పోలవరం మురమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో అమర జీవులు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజుల వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగినది. ముందుగా అమర జీవులు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ నాటి తరం ఉద్యమ స్ఫూర్తిని తీసుకొని ముందుకు కొనసాగాలని, సంఘాన్ని మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకువెళ్లాలని సూచన చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి గంటా సూర్యచంద్రరావు, పాతఇంజరం-వడ్డిచెరువు హైస్కూల్ హెచ్ఎం కాశి వెంకటాచార్య, జిల్లా కార్యదర్శి టి.దుర్గాప్రసాద్, గ్రంధి శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - కొత్తపేట

టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి అన్నారు. భారతవిద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్త్ ప్రజ్ఞా వికాస్ మోడల్ పరీక్షల్లో విజేతలకు శనివారం రాత్రి బహుమతి ప్రదానం చేశారు. స్థానిక ఎంఆర్‌పి హాలు నందు ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ జి.మాధవ, యుటిఎఫ్ అధ్యక్షులు కె.సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరావు హాజరై విద్యార్థిని, విద్యార్థులకు ఉద్దేశి ంచి ముఖ్యమైన సూచనలు, సలహాలను అందజేశారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలనీ కోసం పోరాడుతునే వారిలోని విద్యార్థుల సజనాత్మకను వెలికి తీయడం కోసం ఇటువంటి మోడల్ పరీక్షను నిర్వహిస్తారన్నారు. ఏప్రిల్‌లో జరిగే బోర్డ్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లి, తండ్రులకు మంచి పేరు సుకురావాలని సూచించారు. అనంతరం మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల్లో ప్రజ్ఞా వికాసం మోడల్ పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మండల ప్రథమ స్థాయిలో నిలిచిన వై.తేజశ్విని లక్ష్మి (గర్ల్స్ హైస్కూల్), పిఎస్ఎన్‌విడి.స్వాతి (విద్యాబాలమందిర్), ద్వితీయ స్థానంలో బి.మహాలక్ష్మి (తొత్తిపాడు హైస్కూల్) ఎన్.సారిక (భాష్యం), తృతీయ స్థానంలో బిజెఎస్ఎస్.దేవి (వాడపాలెం హైస్కూల్), ఎన్ఎన్. శ్రీదుర్గా(ఆక్స్ఫర్డ్) ఉన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

కార్యక్రమంలోఎంఇఒ ఎం.హరి ప్రసాద్, యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సూర్యారావు, రాజ్ కుమార్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన అధ్యక్ష కార్యదర్శులు, పి.వెంకటేశ్వరరావు, ఎస్.జ్యోతి బసు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అరకొర పనులతో అవస్థలు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక బైపాస్ రోడ్డు, మండపేట నుంచి ఏడిద రోడ్డు మరమ్మతులతోపాటు తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డు ఆధునికీకరణ పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అట్టహాసంగా ప్రారంభమైన ఈ రోడ్ల పనులు గత కొద్ది రోజుల నుంచి మందకొడిగా జరుగుతున్నడంతో ప్రయాణికులకు, స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. ఎర్ర గ్రావెల్ తరలించే లారీలు కనీసం నిబంధ నలు పాటించకుండా గ్రావెల్ పై బరకం కప్పకపోవడంతో వెనుక వచ్చే వాహనదారులపై గ్రావెల్ పడుతుండడంతో పాటు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

నాలుగు రోజుల్లో తాపేశ్వరం రోడ్డు పనులు

ఈ విషయంపై రోడ్డు భవనాల శాఖ జెఇ సూర్యనారాయణను వివరణ కోరగా మరో రెండు రోజుల్లో రోడ్ల మరమ్మతు పనులు, మరో నాలుగు రోజుల్లో తాపేశ్వరం రోడ్డు పనులు చేపడతామని అన్నారు.

ద్వారపూడి -తాపేశ్వరం రోడ్డులో నిలిచిన పనులు

విద్యార్థినులతో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీదుర్గ

క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విద్యార్థులు క్రమశిక్షణతోనూ పట్టుదలతోనూ చదివి విద్యలో ఉన్నతులుగా ఎదగాలని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అన్నారు. గొల్లవిల్లి బాలికల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గహాన్ని ఆదివారం సర్పంచ్ శ్రీదుర్గ తనిఖీ చేశారు. వసతి గహంలో భోజనం, పరిశుభ్రత, గదులు తదితర వాటిని పరిశీలించిన సర్పంచ్ విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అంకితభావంతో పనిచేయాలని వార్డెన్ తులసికి ఆమె సూచించారు. వైసిపి నాయకుడు జొన్నాడ చిన్ని, పంచాయతీ కార్యదర్శి పరమట సాయిబాబు, గ్రామ పోలీస్ దివ్య ఉన్నారు.

29న మండపేట కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - మండపేట

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారని ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

కార్టూ'నిజం'



వెంకన్న కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ దూడల వీరితా దేవి అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 28న స్వామివారిని పెళ్లి కుమారుడిని చేయడంతో మొదలయ్యే కల్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 7 వరకు 12 రోజులపాటు కొనసాగుతాయని ఛైర్మన్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివస్తారని, ఈ దష్ట్యా వారికి ఏర్పాట్లు చేశామన్నారు. కల్యాణ మహోత్సవానికి సంబంధించి ఆలయంలో నూతనంగా నిర్మించిన శాలహారం, కల్యాణం జరిపే కల్యాణమంటపం ఆలయ గోపురాలకు రంగుల వేశామన్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణాన్ని విద్యుదీపాలతో ముస్తాబు చేశామని, చలువ పందిళ్లు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కొత్త పాలకవర్గం ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఛైర్మన్ వీరితా దేవి వివరించారు. సమావేశంలో ఆలయ అభివద్ధి ప్రోత్సాహకర్త యెండూరి నాగేశ్వరరావు, వైసిపి పట్టణ యువజన అధ్యక్షులు దూడల ఫణి, ట్రస్ట్ బోర్డు సభ్యులు యెండూరి రాఘవ, నడింపల్లి వర్మ, సంసానిఅబ్బు, కుసుమ శ్రీను, ముంగర ప్రసాద్, కాళే ఆధి పట్టాభిరామయ్య, భరణికాన బాబు, దూనబోయిన సూర్యచంద్రరావు, ఇఒ దూనబోయిన సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ వీరితాదేవి

బాలబాలాజీకి వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ సన్నిధిలో ఉత్సవ మూర్తులకు స్థానికులైన గుడిమెట్ల మణికంఠ లోకేష్ గుప్త దివ్య దంపతులు 238 గ్రాముల వెండితో తయారు చేసిన కిరీటాన్ని ఆదివారం బహూకరించినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎంకెటి.వరప్రసాద్ తెలిపారు. కొత్తపేట వాసులు మల్లంపల్లి అయ్యప్పరాజు బాల త్రిపుర సుందరి దంపతులు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గోపాలకష్ణ శాశ్వత అన్నదాన ట్రస్టుకు రూ.10 వేలు విరాళం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

వెండి కిరీటం బహుకరిస్తున్న దాతలు

ఘనంగా అచ్చెన్నాయుడు పుట్టినరోజు

ప్రజాశక్తి - కొత్తపేట

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు వాడపాలెం గ్రామంలోని ఆయన స్వగహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ చేసి అచ్చెనాయుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి విశిష్ట సేవలు అందిస్తూ పార్టీకి పూర్వ వైభవం దిశగా తీసుకెళ్తున్న అచ్చెన్నాయుడి పుట్టినరోజు వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు యువత తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు(పి.గన్నవరం) రాష్ట్ర టిడిపి అధ్యక్షులు కింజవరపు అచ్చెన్నాయుడు పుట్టినరోజును పి.గన్నవరం సెంటర్లో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు, ఎంపిపి అంబటి భూలక్ష్మిల ఆధ్వర్యంలో ఆదివారం టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేశారు. పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి మాట్లాడుతూ అచ్చెన్ననాయుడు నిబద్ధత, నాయకుడు అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొని అచ్చెన్నాయుడుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. **ఆలమూరు** టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్న నాయుడు పుట్టినరోజు వేడుకలను ఆలమూరులో ఆదివారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి ముందుగా వారు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అచ్చెన్ననాయుడుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు మెర్ల గోపాలస్వామి, దండంగి మమత, ఈదల నల్లబాబు, వంటిపల్లి సతీష్ కుమార్, సిద్దిరెడ్డి పెద్దకాపు, ఈదర రమేష్, వక్కపట్ల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం సెంటర్ లో అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకల్లో టిడిపి శ్రేణులు

హాస్టల్ విద్యార్థుల ఇబ్బందులు పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి-అమలాపురం

గోడి గురుకుల వసతిగృహంలో విద్యార్థుల కనీస అవసరాలు తీర్చాల్సిన ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు వారి ఇబ్బందులను పట్టించుకోవడం లేదని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం టిడిపి ఇంఛార్జియం హరీష్ బాలయోగి ఆరోపించారు. అల్లవరం మండలం గోడి గురుకుల వసతిగహంలో టార్పాలిన్ బరకాలను ఆదివారం ఆయన అందించారు. విద్యార్థులు చదువుకోవడానికి సరైన వసతులు లేక కింద కూర్చుని చదువుకుంటున్నారని అందుకే వారి ఈ బరకాలను అందించానని హరీష్ అన్నారు. ఆయన మాట్లాడుతూ వసతుల లేమి బహిరంగంగా కనిపిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, అక్కడ పడుతున్న ఇబ్బందులలో విద్యార్థులకు చదువు ఎలా కొనసాగక వారి భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. వసతి గృహాల్లో అవస్థలు పడలేక, ఎవరికీ చెప్పుకోలేక ఇటీవల ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం మాత్రం వసతులపై దృష్టి సారించకపోవడం బాధాకరం అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో వుంచుకుని భవిష్యత్తు మరిన్ని ఈ గురుకుల విద్యార్థులకు తన వంతు సాయం చేస్తానని హరీష్ బాలయోగి అన్నారు.

గోడి గురుకుల పాఠశాలకు బరకాలు అందజేస్తున్న దృశ్యం

నేడు యథావిధిగా స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో ఈనెల 27వ తేదీ సోమవారం స్పందన కార్యక్రమాలు యథావిధిగా జరుగుతాయని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానికజిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో స్పందన హాల్లో జిల్లా స్థాయిలోను, అదేవిధంగా డివిజన్, మండల కార్యాలయాల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. అధికారులు అందరూ ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తారని గ్రామ వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య అర్జీలు స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిధిలోని సమస్యలను జిల్లా స్థాయి స్పందనకు, డివిజన్ పరిధిలో సమస్యలను డివిజన్ స్థాయి స్పందనకు, మండల పరిధిలో సమస్యలను మండల స్థాయి స్పందనకు, గ్రామ పరిధిలో సమ స్యలను గ్రామ సచివాలయ స్పందనకు సమర్పించి పరిష్కార మార్గాలు కోరాలని అర్జీదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

క్యాన్సర్ బాధితునికి రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - కొత్తపేట

పలివెల గ్రామానికి చెందిన ముషిని వీరవెంకట సత్యనారాయణ గత కొంత కాలం నుండి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మండల యువ శెట్టిబలిజ సంఘం ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని చూసి రూ.10 వేల సాయం ఆదివారం అందించారు. దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని చూసి సహాయం చెయ్యాలని యువ శెట్టి బలిజ సంఘం సభ్యులు కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, గౌరవ సలహాదారులు కొప్పిశెట్టి వాసు, ఖండ్రిగ ఉప సర్పంచ్ కడలి పార్ధ సారథి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముషిని వెంకటరమణ, దంగేటి సాయి, జాయింట్ సెక్రటరీ రాయుడు బాబి, ట్రెజరరీ మామిడిశెట్టి బాలాజీ, కముజు తాతాజీ, బొక్కా పళ్లంశెట్టి, కేత సతీష్, కముజు శ్రీను, కుడిపూడి గణపతి, వాసంశెట్టి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న యువ శెట్టిబలిజ సంఘ సభ్యులు

'ఆర్యవైశ్య' నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కొత్తపేట

ఆర్యవైశ్య యువజన సంఘం ఎన్నిక స్థానిక వాసవి కనికా పరమేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. సభకు అధ్యక్షునిగా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బాబి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు జమీందారు పాల్గొన్నారు. వీరి సమక్షంలో అధ్యక్షునిగా అత్యం నాగేశ్వరరావు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువజన సంఘ అభివద్ధికి అధ్యక్షులు తోడ్పడి సంఘ బంధనలకు కట్టుబడి ఉండాలని సేవేధ్యేయంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట్ల ప్రభాకర్ విశ్వేశ్వరరావు, జిల్లా మెడికల్ కమిటీ ఛైర్మన్ వాసవి క్లబ్ అధ్యక్షులు డాక్టర్ పి.కృష్ణారావు, జిల్లా సంఘ సభ్యులు తమన్న సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడు నాగేశ్వరరావులో సంఘ సభ్యులు

అభినందనలు తెలుపుతున్న యువకులు

ఎంపీ అనురాధ నియామకంపై అభినందన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కేంద్ర వినియోగ దారుల వ్యవహారాలు, ఆహారం,ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యురాలి గా నియమితులైన అమలాపురం ఎంపి చింతా అనురాధను ఆదివారం అల్లవరం మండలం మొగళ్ళమూరులో సన్నవిల్లి రాంజీనగర్ కు చెందిన వైసిపి కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో నక్కా చిన్న, పెయ్యల పల్లయ్య, మొసలి దుర్గారావు, పోతుల శ్రీనివాసరావు, చీకురుమిల్లి వెర్రియ్య, మొసలి రాజేష్, పోతుల దుర్గా ప్రసాద్, పోతుల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు

మహిళాభ్యుదయమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

మహిళాభ్యుదయమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. కపిలేశ్వరపురం మండలంలోని టేకిలలో ఆదివారం వైఎస్ఆర్ ఆసరా పథకం సొమ్ము పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు మాట్లాడుతూ మండల ంలో 1,504 సంఘాలకు చెందిన 14,176 మంది సభ్యులకు రూ.11.94 కోట్లు జమ అయ్యిందన్నారు. కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల 2,580 మంది సభ్యులకు రూ.2,07,00,868, వాకతిప్ప, నాగుల చెరువు, కోరుమిల్లి, మాచర, టేకి గ్రామాల 4,403 మంది సభ్యులకు రూ.4,18,13,488 మంజూరైందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, జెడ్‌పిటిసి సభ్యురాలు పుట్ట పూడి సూర్యనారాయణ మూర్తి, సర్పంచ్‌లు సాకా శ్రీనివాస్, కుక్కల నాగమణి, వాసంశెట్టి సునీత, ఎంపిటిసి సభ్యులు జుత్తుక వెంకటలక్ష్మి, శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, ఉమ్మిడిశెట్టి వీరవేణి, శీలం సూర్యావతి తదితతరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

ఆదివారం సింగవరం సచివాలయం సమీపంలో ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నిడదవోలు గ్రామానికి చెందిన పలువురు దేవీపట్నం మండలం గండిపోచమ్మ ఉత్సవాలకు వెళ్ళారు. ఆదివారం తిరిగి వస్తుండగా సింగవరం సచివాలయం సమీపంలో ఎటుగట్టు మీద నుండి ఆటో అదుపుతప్పి నిమ్మతోటలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వైద్యం నిమిత్తం క్షతగాత్రులను హుటాహుటిన జనసేన అంబులెన్స్‌లో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఐదుగురిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి- కరప

దాడి కేసులో ఐదుగురిపై ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నౌడు రామకష్ణ తెలిపారు. కరప నక్కవారిపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఇటీవల జరిగిన దాడి ఘటనలో కరప గ్రామానికి చెందిన కొప్పాడ మణికంఠ, కొప్పాడ వెంకటకష్ణ, అంగాడి దుర్గాప్రసాద్, వనమాడి సురేష్, కొప్పాడ వీరమణిపై కులం పేరుతో దూషించారని, గాయపరిచారని అదే గ్రామానికి చెందిన గొల్ల రవి, కనికెళ్ల అశోక్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై సమగ్రంగా విచారణ జరిపి అట్రాసిటీ కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకష్ణ తెలిపారు. ఈ కేసులో సాక్షులను విచారించేందుకు ఆదివారం డిఎస్‌పి కరప గ్రామంలో బాధితుల ఇంటికి వెళ్లారని చెప్పారు.

బైకు అదుపు తప్పడంతో గోదావరిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

బైకుపై వేగంగా వెళుతూ ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు మలుపులో గోదావరిలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన కె.గంగవరం మండలం రాజువేరి గ్రామం వద్ద చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రాజమండ్రి వద్ద లాలాచెరువు సమీప ప్రాంతమైన బాబానగర్‌కు చెందిన యువకుడు యర్ర ప్రదీప్ కుమార్ (30) యానం వైపు నుండి వస్తూ రాజువేరు గ్రామంవద్ద ఎస్ ఆకారంలో ఉండే మలుపు గమనించకుండా ఇక్కడ గల వంతెన పైనుండి గోదావరిలో పడిపోయాడు. పరిసర ప్రాంత ప్రజలు గమనించి ఇతనిని పైకి తీసేలోపు మృతి చెందినట్లు పోలీసులు వివరించారు. మతదేహాన్ని రామచంద్రాపురం ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం బండారులంక కందులపాడు కాలనీకి చెందిన వివాహిత దంగేటి దివ్య (32) ఆదివారం ఈదరపల్లి కాలువలో పడి అనుమానాస్పదంగా మృతి చెందింది. శనివారం ఆమె అదశ్యమైనట్లు ఆమె భర్త పార్థసారథి అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పరదేశి తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని వెలిచేరు గ్రామ శివారులో ఆదివారం పేకాట శిబిరంపై ఎస్‌ఐ సిహెచ్.సుధాకర్ తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4 వేల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రాత్రి సమయంలో ఫ్లైఓవర్ వద్ద చీకట

విద్యుత్ లైట్లు పునరుద్ధరించరూ..

ప్రజాశక్తి-నల్లజర్ల

పుల్లలపాడు నుంచి దూబచర్ల వైపు 16వ నెంబరు జాతీయ రహదారిపై, ఉన్న మొదటి ఫ్లై ఓవర్ వద్ద గత నెల రోజుల నుండి విద్యుత్ లైట్లు వెలగడం లేదని వాహన చోదకులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే విద్యుత్తులైట్లను బాగు చేయించాలని వేడుకుంటున్నారు.

పుల్లలపాడు వైపు నుండి దూబచర్ల మీదగా అనేకమంది భక్తులు పాదయాత్రగా ద్వారకాతిరుమల చిన్న వెంకన్న దర్శనం కోసం నిత్యం వెళుతూ ఉంటారు రాత్రి సమయంలో ఈ ఫ్లైఓవర్ వద్ద చీకటిగా ఉన్నందున అనేకమంది మద్యం సేవించి ఉంటారు. వీరితో పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు ఇబ్బందికరంగా ఉంటుంది. చీకటిలో ఎవరు ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడతారో అని. ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని, యాత్రను కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి మంగళవారం ఆదివారం చేపల విక్రయదారులు వాహనాలను వేకువ జామున ఆ ప్రాంతంలో నిలిపి విక్రయాలు చేస్తూ ఉంటారు. పుల్లలపాడు, ముష్యలకుంట గ్రామస్తులు ఆ దారి గుండా వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. ఉదయం నాలుగు గంటల నుంచి 5 గంటల మధ్య అనేకమంది యువకులు ఇదే ఫ్లైఓవర్ వద్ద తమ బైకులను ఉంచి దూబచర్ల వైపు వ్యాయామం నిమిత్తం (వాకింగ్) నడుస్తూ ఉంటారు. చీకటిలో వాహనాలు ఉంచడం వల్ల తిరిగి వచ్చేసరికి అవి ఉంటాయో లేదో అని, భయపడుతున్నామని కొందరు వాపోయారు. తక్షణమే సంబంధిత శాఖ వారు స్పందించి ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ లైట్లు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

మంచినీటి కాలువ ఆధునికీకరణేదీ..

మురికినీటి కాలవను తలపిస్తున్న వైనం
శిథిలమై పలుచోట్ల కూలిపోయిన కాలవ గోడలు

ప్రజాశక్తి -యానాం

యానాం భీమ్ నగర్ నుంచి నల్లచెరువు వద్ద గల తూము వరకూ ఉన్న మంచినీటి కాలువ సంవత్సరాలు గడుస్తున్నా ఆధునీకరణకు మాత్రం నోచుకోవడం లేదు. మంచినీటికాలవ పరిస్థితి కాస్తా మురికినీటి కాలవగా మారినా అధికారుల్లో చలనం రావడం లేదు. మంచినీటి చెరువులకు నీరు వెళ్లే కాలవపట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నల్లరాళ్లతో కట్టిన కాలవ గోడ ప్రస్తుతం పూర్తిగా శిథిలస్థితికి చేరింది. పలుచోట్ల గోడలు కొంతమేర కూలిపోగా కొన్ని చోట్ల భారీగా బీటలు తీసింది. అయితే గతేడాది యూకేవినగర్ దగ్గర కాలవగోడ కొంతమేర కూలిపోగా అక్కడ కాంక్రీటు గోడ నిర్మించారు. కాలవగోడ మొత్తం శిథిలమైతే పూర్తి స్థాయిలో ఆధునీకరించకుండా ముక్కలు ముక్కలుగా నిర్మించడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా పనుల శాఖ అధికారులు చెరువులకు నీరుపట్టే సమయంలో మొక్కబడిగా పూడికలు తీయించడం తప్ప కాలవ నిర్వహన పట్ల శ్రద్ధ లేదన్న సంగతి కాలవను చూస్తే అర్థమవుతుంది. కాలవ దుస్థితిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కాలవను పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని,లేకపోతే పైప్ లైన్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మంచినీటి కాలవ పక్కనే మురికినీటి డ్రైన్

మంచినీటి కాలవలో కలుస్తున్న మురుగు

మంచినీటి కాలవ ప్రక్కనే మురికినీటి కాలువ

ఈ మంచినీటి కాలవకు ఆనుకొని పైవాలున మురికినీటి డ్రైన్ నిర్మించిన ఘనత స్థానిక ప్రజాపనులశాఖ అధికారులకే దక్కుతుంది. భీమ్ నగర్ నుంచి యూకెవి నగర్ రోడ్ వరకూ కాలువ వెంబడి పైవాలున మురికినీటి డ్రైన్ నిర్మించారు. అయితే అప్పుడప్పుడు మురికి నీటి కాలవ పొర్లిపోయి ఆ నీరంతా మంచినీటి కాలవలో కలుస్తోంది. వర్షకాలంలో అయితే యూకేవి నగర్ నుంచి వచ్చే మురికినీరంతా మంచినీటి కాలువలోనే కలుస్తుంది. మురికినీటి కాలవను మూసివేసి మంచినీటి కాలవకు దూరంగా నిర్మించాలని ఎప్పటినుంచో ప్రజలు కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించాల్సిన అధికారులకు మంచి కాలవను పట్టించుకునే తీరిక లేకపోయింది. కాలవతూము వద్ద నివాసం ఉంటున్న కొంతమంది కాలవలోనే నిత్యం దుస్తులు ఉతకడం, తదితర పనులు చేస్తున్నా ఇదేమిటని అడిగే పరిస్థితి లేదంటే..ఇది నిర్లక్ష్యానికి పరాకాష్ట అని చెప్పవచ్చు.మంచినీరు కలుషితం కాకుండా పైప్ లైన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదంలో 4 ఇళ్లు దగ్ధం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామంలోని 4 చేనేత కార్మికుల ఇళ్లు ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదానికి ఆహుతయ్యాయి. ఈ సంఘటనలో 7 కుటుంబాల సభ్యులు నిరాశ్రయులయ్యారు. స్థానిక గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వంట గ్యాస్ లీక్ అవడంతో మంటలు చెలరేగి ఒక్కసారిగా సిలిండర్ పేలడంతో ఈ పెను ప్రమాదం సంభవించిందని బాధితులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఎంపిపి కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్‌పిటిసి పందిరి శ్రీహరి రామ్ గోపాల్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులకు తక్షణ సాయంగా అమలాపురం మండల రెవెన్యూ అధికారులు ఒక్కొక్క కుటుంబానికి 20 కేజీల చొప్పున బియ్యాన్ని అందజేశారు. వారి వెంట వార్డు మెంబర్ గుత్తుల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిన ఇల్లు

గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మర్లపాలెం గ్రామానికి చెందిన సిఆర్‌పిఎఫ్ జవాన్ పల్లి ఇజ్రాయిల్ చికిత్స పొందుతూ శనివారం హైదరాబాద్ కేర్ ఆసుపత్రిలో మృతి చెందాడు. జవాన్ మృతదేహాన్ని సిఆర్పిఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ డిఎస్‌పి ఎం.రాధా ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రభుత్వ పరంగా తక్షణ సాయంగా రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం ర్యాలి శ్మశాన వాటికలో ప్రభుత్వ లాంచనాలతో మిలటరీ సిబ్బంది స్థానిక పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. జావాన్ కుటుంబ సభ్యులను గ్రామ సర్పచ్ మెర్ల రాము తదితరులు పరామర్శించారు.

నూకాంబిక ఆలయానికి యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం యాత్రికులు పోటెత్తారు. ఉదయం నుండి అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వేలాదిమంది యాత్రికులు తరలివచ్చారు. రావులపాలెం సిఐ రజిని కుమార్, ఎస్‌ఐ ఎస్ శివప్రసాదులు భారీ బందోబస్తు నిర్వహించారు యాత్రికులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఉండవల్లి వీర్రాజు చౌదరి, ధర్మకర్తల మండలి చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ శ్రీనివాస్, తదితరులు పర్యవేక్షించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఐఎఫ్‌టియు నాయకులు అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఐఎఫ్‌టియు 7వ మహాసభ ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగింది. తొలుత కోటిపల్లి బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా సభాప్రాంగణమైన గోదారి గట్టున శ్రీశివ వీరభద్ర రజక కళ్యాణ మండపం వరకు కార్మికులతో ర్యాలీ సాగింది. ప్రదర్శన అనంతరం కళ్యాణ మండపం వద్ద ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎవి.రమణ పతాకావిష్కరణ చేశారు. అనంతరం రమణ అధ్యక్షతన మహాసభ ప్రారంభమైంది. ఈ సభలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంబూరు శ్రీమన్నారాయణ ప్రారంభోపన్యాసం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పక్కదారి పట్టిస్తుందన్నారు. మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తుందన్నారు. నిరుద్యోగాన్ని, పేదరికం, అసమానతలను పెంచి పోషిస్తుందని విమర్శించారు. అంబానీ, ఆదానీలకు దేశసంపదను అప్పనంగా దోచిపెడుతుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా అందరకూ ఐక్యంగా పోరాడాలన్నారు. అనంతరం సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం దుర్గాప్రసాద్, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన రైతాంగ పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.సత్తిబాబు, పి.వెంకట నాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ రాజమండ్రి అధ్యక్షులు టి.నాగేంద్ర పాల్గొన్నారు.

'అల్లుకున్న' నిర్లక్ష్యం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక బైపాస్ రోడ్డులోని ఐస్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభానికి పాదులు నిండుగా అల్లుకున్నాయి. విద్యుత్ వైర్లకు పాదుల తీగలకు తాకితే వాటి ద్వారా విద్యుత్ ప్రవాహంతో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని పలువురు చెబుతున్నారు. అలుముకున్న పాదుల తీగలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లలోకి వెళ తున్నాయని ట్రీ కటింగ్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అల్లుకున్న పాదులు

టిడిపి ఆఫర్‌ను తిరస్కరించా : ఎంఎల్‌ఎ రాపాక

ప్రజాశక్తి-అమలాపురం

ఎంఎల్‌సి కోటాలో ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థికి ఓటు వేస్తే రూ.పది కోట్లు ఆఫర్ చేశారని వైరల్ అవుతున్న వార్తపై రాపాక ఆదివారం స్పందించారు. ఆదివారం రాజోలులో ఒక కార్యక్రమంలో పాల్గొన్న రాపాక మాట్లాడుతూ తను చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చారు. శనివారం అంతర్వేదిలో వైసిపి కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నానని అన్నారు. ఈ సందర్బంగా ఈ వ్యాఖ్యలు చేశానని ఆయన అన్నారు. ఆ సందర్భంలో మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఏ పార్టీలో ఉన్నా నీతి నిజాయితీతో పని చేయాలని, అక్రమాలకు పాల్పడకూడదని అన్నానని పేర్కొన్నారు. తన ఓటు అమ్ముకుంటే రూ. 10 కోట్లకు పైగా వచ్చేవని అన్నాను గాని, రూ. 10 కోట్లు ఇస్తానని ఎవరూ అనలేదని అన్నారు. ఎంఎల్‌సి ఓటింగ్ సందర్భంలో ఉండి ఎంఎల్ఎ రామరాజు టిడిపి మద్దతు పలకాలని మీ భవిష్యత్తు బాగుంటుంది ఆర్థికంగా కూడా ఆదుకుంటామని అన్నారని రాపాక తెలిపారు. వెంటనే ఎంఎల్ఎ రామరాజు ఆఫర్ ను తిరస్కరించానని క్రాస్ ఓటింగ్ వేయనని కచ్చితంగా చెప్పానని రాపాక వరప్రసాద్ అన్నారు. ముందుగా టిడిపి వారు తన మిత్రుడు రాజోలు నియోజకవర్గం వైసిపి నాయకులు కెఎస్ఎన్.రాజు ను సంప్రదించారని, అయితే మా ఎంఎల్ఎ డబ్బులు తీసుకుని ఓటు వేసే వ్యక్తి కాదని కెఎస్ఎన్.రాజు తో చెప్పినట్లు రాపాక తెలిపారు .తన దగ్గర రూ.కోట్ల డబ్బు లేదన్నారు. డబ్బుకి లొంగకుండా ఆత్మ ప్రమోదానుసారం తన ఓటు హక్కు వినియోగించుకున్నారని రాపాక అన్నారు. సిఎం జగన్ ఆదేశాలు పాటిస్తానని రాపాక తెలిపారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రాపాక

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమాజంలో ఉపా ధ్యాయ వృత్తి చాలా గౌరవ ప్రదమైనదని, సమాజాభివృద్ధిలో కూడా గురువులే కీలకమనిఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. అంతటి సమర్థులు చట్ట సభల్లో దిశా నిర్దేశం చేసి ఈ రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధిలో అగ్రస్థానంలో ఉండాలని నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయ ఎంఎల్‌సి సభ్యులను ఎంపీ కోరారు. ఆదివారం రాజమండ్రి రూరల్ కాతేరు వెంకటాద్రి కల్యాణ మండపంలో 'ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సిలుగా ఎన్నికైన వారికి అభినందన సభ నిర్వహించారు. కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి టి.కల్పలతారెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎంవి.రామచంద్రారెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి పి.చంద్రశేఖర్‌రెడ్డిలను ఎంపీ భరత్, హోం మంత్రి తానేటి వనిత, వైసిపి జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించి జగన్ పాలనపై సంపూర్ణ మద్దతును ప్రకటించారని, ఇదే విధంగా 2024 ఎన్నికల్లోనూ జగన్ కే పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ విద్యా సంస్థల ప్రతినిధులు, నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యానాం వార్తలు

బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

పశువులు, కోళ్లు, పక్షుల ప్రదర్శన

ప్రజాశక్తి-యానాం

పశువులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆర్‌ఎఒ మునిస్వామి పేర్కొన్నారు. ఆదివారం పుదుచ్చేరి పశు గణాభివద్ధి, పశుసంక్షేమశాఖ ఆద్వర్యంలో స్థానిక వెటర్నరీ ఆసుపత్రి ఆవరణలో పశువులు, కోళ్ల, పక్షులు, పెంపుడు కుక్కల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆవులు, గేదెలు, మేకలు తదితర వాటిని అభివద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందని వాటి పెంపకం ద్వారా పలు కుటుంబాలు ఆర్థికాభివద్ధి సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. వివిధ గ్రామాలనుంచి పశువులను తీసుకురావడంతో వెటర్నరీ ఆసుపత్రి అంతా సందడి నెలకొంది. ఆవుల విభాగంలో ప్రథమ బహుమతి కూరాకుల సత్తిబాబు, ద్వితీయ బహుమతి చంపటి కష్ణంరాజు, తతీయ బహుమతి వంటెద్దు వాసుకు లభించగా, గేదెల విభాగంలో వంటెద్దు జగదీశ్వరి, ద్వితీయ బహుమతి కోనామి లక్ష్మీనారాయణ, తతీయ బహుమతి కూరాకుల వంశీకి లభించింది. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మెల్ల వెంకటరమణ, డాక్టర్ చెక్కపల్లి శ్రీరామ్, విఎఎస్ డాక్టర్ కె ఆంద్రు జాబకుమార్, సిబ్బంది పండు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో నేటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభిస్తున్నట్లు ఆర్‌ఎఒ మునిస్వామి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతి రోజూ ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, పాఠశాలలు ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరగనున్నాయని తెలిపారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

రామ్‌చరణ్ అభిమానుల రక్తదానం

ప్రజాశక్తి - అమలాపురం

సినీనటుడు రామ్ చరణ్ తేజ్ పుట్టినరోజు వేడుకలు సందర్భం గా వివిధ సేవ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. అంబాజీపేట మండల రామ్ చరణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూషణ్ నాయుడు ఆధ్వర్యంలో అమలాపురం బుద్దాల బ్లడ్ బ్యాంక్ ఆదివారం బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. రక్త దాతల సంఖ్య తగ్గిన ఈ సమయంలో రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేసి ఎందరో ప్రాణాలను కాపాడుతున్న రామ్ చరణ్ ఫ్యాన్స్ రక్తం దానం చేసిన ప్రతీ ఒక్కరికీ బుద్దాల బ్లడ్ బ్యాంక్ వారు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యాపురం కో-ఆపరేటివ్ బ్యాంకు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శతాబ్ద కాలం చరిత్ర కలిగిందని, రాష్ట్రంలోనే అతి పెద్ద కో-ఆపరేటివ్ బ్యాంకుగా ఉందని, దీన్ని మరింత అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ పిలుపునిచ్చారు. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ విషయంలో పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఎంపీ అభినందించారు. అనంతరం బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ కో-ఆపరేటివ్ బ్యాంకు 1919లో సరిపెల్ల విశ్వేశ్వర ప్రసాదరావు ఏర్పాటు చేశారన్నారు. వందేళ్లుగా ఖాతాదారుల అభిమానం, నమ్మకంతో నడుస్తోందన్నారు. ఏ సంస్థకైనా నమ్మకమే ప్రగతికి మెట్లు అనే విషయాన్ని పాలకవర్గం, సిబ్బంది మర్చిపోరాదన్నారు. వ్యవస్థాపకుల ఆశయాలకు మరింత శోభ తెచ్చే విధంగా ప్రస్తుత పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. ఈ బ్యాంకు 16 బ్రాంచ్‌లతో 90 వేల సభ్యులతో నడుస్తోందన్నారు. రూ.700 కోట్లు డిపాజిట్లు, రుణాలు, అడ్వాన్సులుగా రూ.380 కోట్లు ఇవ్వగా రూ.300 కోట్లు నిల్వలు ఉన్నాయన్నారు. గత సంవత్సరం బ్యాంకు ప్రాఫిట్ రూ.23 కోట్లయితే, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.27 కోట్లు లాభాలు గడించిందన్నారు. వచ్చే సంవత్సరానికి మరింత లాభాల బాటలో పయనించాలని ఆకాంక్షించారు. తొలుత బ్యాంకు ఆవరణలో గల ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వ్యవస్థాపకుడు సరిపెల్ల విశ్వేశ్వర ప్రసాదరావు విగ్రహానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గ ఛైర్మన్ గిరజాల రామకృష్ణతులసి, సభ్యులు మజ్జి నూకరత్నం, మార్గాని సురేష్, సక్కెళ్ల బాబూరావు, పెంకే సురేష్ కుమార్, పతివాడ రమేష్‌బాబు, రాయుడు గణేష్, వేణుం వెంకటేశ్వరరావు, గొల్లపాటి లీలా గంగాధరరావు, వెంట్రపాటి సురేష్, యర్రా ప్రసాదరావు, వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైసిపి నేత గిరజాల బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

టోల్ గేట్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో టోల్‌గేట్లలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో ఎపి టోల్‌గేట్ యూనియన్ రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో కె.చినబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్బంగా మధు మాట్లాడారు. చాలా టోల్‌గేట్లలో సిబ్బంది 2015 నుంచి పనిచేస్తున్నారన్నారు. అప్పటి నుంచి వీరికి కనీస వేతనం కూడా అమలు కావట్లేదన్నారు. సిబ్బందికి నెలకు రూ.10వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారన్నారు. వీటితో వారు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. చాలా టోల్‌గేట్‌లలో సిబ్బందికి కనీసం గుర్తింపు కార్డులు కూడా మంజూరు చేయలేదన్నారు. జాబ్ ఆర్డర్ కూడా ఇవ్వలేదన్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్నా ఎలాంటి ప్రమోషన్లూ లేవన్నారు. ఫాస్ట్ ట్యాగ్ వల్ల పని మరింత కఠినమైందన్నారు పెరిగే దరలుకనుగుణంగా కనీస వేతనం రూ.20వేలకు పైగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎఐటియుసిజిల్లా కన్వీనర్ కె.రాంబాబు మాట్లాడారు. సిబ్బందికి ఇంక్రిమెంట్లు ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అల్యూమినియం క్రిష్ బిల్ నాయకులు వి.కొండలరావు, ఎఐటియుసి నగర నాయకులు ఎంఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా కె.రాంబాబు, గౌరవ అధ్యక్షులుగా తాటిపాక మధు, అధ్యక్షులుగా కె.చినబాబు, ఉపాధ్యక్షులుగా రామ్మూర్తి తదితరులు ఎన్నికయ్యారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎంఎల్‌సి ఇజ్రాయేల్ పర్యటన జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఎంఎల్‌సిగా గెలుపొందిన బొమ్మి ఇజ్రాయేల్ ఈనెల 28న తొలిసారిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని మాదిగ పొలిటికల్ జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరు బాబూ జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్ లో ఆదివారం పొలిటికల్ జెఎసి సమావేశం చేట్ల విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించారు. 28వ తేదీ మధ్యాహ్నం జిల్లా ముఖద్వారమైన రావులపాలెం కు చేరుకుని అక్కడ నుంచి విజయోత్సవ ర్యాలీ జరిపి అమలాపురం మీదుగా ఇజ్రాయేల్ స్వగ్రామమైన అల్లవరం మండలం గోడి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో పొలిటికల్ జెఎసి నాయకులు తొత్తరమూడి నరసింహారావు, సత్తాల దుర్గారావు, చేట్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189